క్లుప్తంగా

విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి విండ్ బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: సంక్రాంతి సందర్భంగా 67వ వార్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే జట్లకు రూ.12 వేలు, రూ.6 వేల నగదు బహుమతిని, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు మార్టుపూడి పరదేశి, ఎస్‌ఎండీ గౌస్, పల్లా పెంటారావు, చిత్రాడ అప్పారావు, అన్నపూర్ణ, లక్ష్మి, నిర్వాహకులు ప్రశాంత్, పల్లా నరేష్, సాహిద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్య వలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ సారధ్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు విందుల వెంకటరమణ, బలిరెడ్డి శ్రీను, విందుల వరహాలు, సాయిన సన్యాసిరావు, మరిశా రామచంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, పాముల వసంతరావు, పట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆర్‌హెచ్‌కాలనీ దుగ్గపువానిపాలెంలో వెలసిన దానప్పతల్లి అమ్మవారి చీరలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పేద మహిళలకు ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం భోగి పండగ రోజున సంవత్సరం మొత్తం మీద వచ్చిన చీరలను భోగి రోజు పంపిణీ చేస్తారు. అందులో భాగంగా ఆదివారం సుమారు 680 మంది పేద మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో సరళ కొండలరావు, డీవీ అప్పారావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, ప్రగడ శంకరరావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ అప్పలనర్సయ్య, పిన్నింటి సంతోష్, ప్రగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగికి సీఎండీ అభినందన



గోపాల్‌ను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: ఎంబీఏలో గోల్డ్ మెడల్ అందుకున్న ఉద్యోగిని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అభినందించారు. స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎం. గోపాల్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ (మార్కెటింగ్‌లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో గోపాల్‌ను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎస్. బలరామ్, జి. ఆనంద్ పాల్గొన్నారు.

పారిశ్రామికవాడకు.. పండగ కళ

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. భోగి వెలుగుల్లో మిరుమిట్లు గొలిపాయి. ప్రతి ఇంట రంగవల్లుల వర్ణాలు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నల పల్లెపదాలు, హరిదాసుల కీర్తనలు, ఢమరుక నాదాలు, జంగమదేవరల జేగంటలు, పిట్టలదొరల బడాయి కబుర్లతో పట్నాలు కూడా పల్లెల్ని తలపిస్తూ.. సంప్రదాయ కాంతులను విరజిమ్ముతున్నాయి.

- భోగి, సంక్రాంతి శోభతో కళకళలాడుతున్న లోగిళ్లు
- రంగవల్లులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలతో అంతటా కోలాహలం



బల్లవేషాలు (ఫైల్)

గాజువాక: సంక్రాంతికి నగరం మొత్తం ఖాళీ అయిపోయినా గాజువాక మాత్రం జనంతో కిటకిటలాడుతోంది. ఈ ప్రాంతం పంచాయతీ నుంచి మహా విశాఖ స్థాయికి ఎదిగినా పండగ సమయంలో మాత్రం పల్లె వాతావరణమే ఇక్కడ వెల్లివిరుస్తుంది. ఎక్కడో కొన్ని ప్రాంతాల్లో తప్ప పలు ప్రాంతాలకు చెందినవారు గాజువాకలోనే పెద్ద పండగ జరుపుకుంటారు. పారిశ్రామిక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచిన గాజువాకలో గ్రామాల సంఖ్య కూడా అధికంగా ఉండటమే దీనికి కారణమని చెప్పొచ్చు. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో విస్తరించిన ఈ ప్రాంతంలో దాదాపు 45 గ్రామాలున్నాయి. గాజువాక పట్టణంలోని పురాతన గ్రామాలైన జోగవానిపాలెం, అజీమాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలైన చినగంట్యాడ, చట్టివానిపాలెం, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తోకాడ, యారాడ, కొత్తదిబ్బపాలెం పూర్తిగా స్థానిక గ్రామాలే కావడం విశేషం. వీటితో పాటు స్టీల్‌ప్లాంట్ పునరావాస కాలనీలు కూడా స్థానిక గ్రామాలే. గతంలో గ్రామాలుగా ఉన్న పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం, యాతపాలెం గ్రామాలు ప్రస్తుతం పునరావాస కాలనీలుగా అభివృద్ధి చెందాయి. ఈ ఐదు పునరావాస కాలనీల్లోను సుమారు 48 గ్రామాలకు చెందిన వారు స్థానికులే. ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి ఎంత మంది వలసలు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ స్థానిక గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సంక్రాంతికి ఈ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోతుంది.

సంక్రాంతి ముద్ర..

పల్లెటూళ్ల మాదిరిగా సంక్రాంతి పండుగ ఉత్సాహం ఈ ప్రాంతంలో స్పష్టంగా కనిపిస్తుంది. అన్ని గ్రామాల్లోను పరసలు, తిరునాళ్ల పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తూ గ్రామీణ సాంప్రదాయాలను కొనసాగిస్తారు. గాజువాక ప్రాంతానికి చెందిన పలు గ్రామాలతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన పునరావాస కాలనీల్లోను పరసలు ఘనంగా కొనసాగుతాయి. గాజువాక, చినగంట్యాడ గ్రామాలకు చెందిన పరసలను మరింత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలు నిర్వహించి పరసల సందర్భంగా ఏర్పాటు చేసే వేదికలపై విజేతలకు బహుమతులు అందజేస్తారు. తమ గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు బంధువులను సైతం ఆహ్వానించి సంబరాలు జరుపుకోవడం ఈ ప్రాంత ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఘనంగా భోగి

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గాజువాకలో భోగి మంటల సందడి చోటు చేసుకుంది. ఆదివారం తెల్లవారు జాము మూడున్నర గంటల నుంచి గ్రామాలు, కాలనీల్లో ఉత్సవాలు మొదలయ్యాయి. మరోవైపు భోగి సందర్భంగా పలు ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి గణపతి పూజ, అష్టోత్తర శతనామావళి, అర్చనలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణంతోపాటు భక్తి గీతాలు అలపించారు.



ప్రసన్న గిరి కొండపై భోగి మంటలను ఆస్వాదిస్తున్న భక్తులు

ప్రసన్న గిరి కొండపై..

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరి కొండపై భక్తులు భోగి మంటలు వేసి ఆనందంగా వేడుక జరుపుకున్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని వీధుల్లో చిన్నచిన్న మంటలు వేసి భోగి పండగ జరుపుకున్నారు.

నాతయ్యపాలెంలో..

జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో ఆదివారం రాత్రి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు (సన్ని) ఆధ్వర్యంలో ఆయన నివాసంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పాటలు పాడి, కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోగాది అప్పారావు, గోపిశెట్టి రామకృష్ణ, సిరసపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు నడుపూరులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో గల పైడిమాంబ ఆలయ సమీపంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, బత్తిన భానుకిరణ్, చెల్లుబోయిన కృష్ణ, నెల్లి అప్పలరాజు, ఏకుల వెంకటేష్ గౌడ్, నెల్లి సాధూరావు, పితాని పాత్రుడు, పితాని భాస్కరరావు, రమణబాబు పాల్గొన్నారు.



69వ వార్డు నాతయ్యపాలెంలో వార్డు అధ్యక్షుడు బోగాది నివాసంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

జాబిలీ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ వద్ద..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని ఉక్కు జనరల్ ఆస్పత్రి రోడ్డులోని జాబిలీ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ వద్ద కాలనీవాసులు భోగి మంటలు వేసి నృత్యం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామారావు, వీరునాయుడు, శంకరరావు, వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవానీ, జయ, హేమ పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో..

పెదగంట్యాడ : జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని క్వారీ రోడ్డులో గల స్వర్ణ నూకాంబిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొని సందడి చేశారు.



భోగి మంట వేసి పాటలు పాడుతున్న జాబిలీ హిల్స్ నివాసితులు

కమనీయం.. గోదా కల్యాణం



గోదా శ్రీనివాసులు



మాంగల్యధారణకు ముందు పుస్తెలను భక్తులకు చూపుతున్న అర్చకులు



ఉక్కు వెంకన్న ఆలయంలో కల్యాణం చేస్తున్న అర్చకులు



గోదా కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: గోదా శ్రీనివాసుల కల్యాణం కమనీయంగా సాగింది. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వినాయక స్వామి, వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో గోదా శ్రీనివాసుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ప్రతి భక్తునికి అర్చక స్వాములు కంకణాలు కట్టారు. శ్రీనివాసునికి జంధ్య ధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోదా దేవికి శ్రీనివాసునికి కల్యాణ తెర ఏర్పాటు చేసి గోదాదేవికి అర్చక స్వాములు వేద మంత్రాల నడుమ జీలకర్ర బెల్లాన్ని నెత్తిపై పెట్టారు. పుస్తెలు, నూతన వస్త్రాలు, కొబ్బరి గెల, అరటి గెలలను భక్తులచే తాకించారు. గోదా దేవిని అర్చక స్వాములు, బంధు గణాలతో శ్రీనివాసుని చెంతకు చేర్చారు. అనంతరం మంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టం నిర్వహించారు. పూలతో తయారు చేసిన పూబంతులను భక్తులు ఉత్సాహంగా ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఆడారు. ఆలయ ఈవో ఎ.జగన్నాథరావు పర్యవేక్షణలో వైఎస్సార్‌సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, ఆలయ కమిటీ చైర్మన్ గంర్రెడ్డి రామునాయుడు, మెంబర్లు బోడ్డెడ అచ్చిలినాయుడు, పెట్ల అప్పారావు, ఎం.లక్ష్మి, శాంతికుమారి, శ్రీనివాసరావు, ఎక్స్ అఫిషియో మెంబర్ నారాయణాచార్యులు పాల్గొన్నారు. అదే విధంగా షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గోదా శ్రీనివాసుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు భావనారాయణస్వామి, అర్చకులు ఉదయ్ కృష్ణమాచార్యులు, హరినారాయణ ఆధ్వర్యంలో రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గోదా కల్యాణంలో పాల్గొన్న తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు

అగనంపూడి శాంతినగర్ కాలనీలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా గోదా రంగనాథుల కల్యాణోత్సవం జరిపించారు. అగనంపూడి పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తరువాత బొమ్మల కొలువు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దయాల్‌నగర్‌లోని వేంకటాద్రిపై..

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేస్వార స్వామి వారి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్ని కల్యాణాన్ని కనులారా తిలకించారు.

అయోధ్య రామ మందిరం స్టిక్కర్ల ఆవిష్కరణ



అయోధ్య రామ మందిరం స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అయోధ్యలో శ్రీరామ మందిరం జనవరి 22వ తేదీన ప్రారంభం కానున్న నేపథ్యంలో గాజువాక వాసవీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ రామ మందిరం స్టిక్కర్లను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆదివారం స్టిక్కర్లను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పలు వాహనాలకు అంటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్ది శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కులుకురి మంగరాజు, వాసవీ సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ నంబూరి జగన్నాథరావు, ప్రతినిధులు కేసారపు శ్రీను, రమేష్, కేసారపు సతీష్, టాబు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు ఎవరికీ లేదు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న అనాలోచిత నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1067వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులతో పాటు వైఎస్సార్‌టీయూసీ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని, సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పతంగుల పండగ



పతంగుల పండగను ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పతంగుల పండగ ఉత్సాహంగా జరిగింది. స్థానిక త్రిష్ణ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ఉక్కునగరం యూనిట్ అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పతంగుల పండగ భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. ప్రతిభ కనబరిచిన సీనియర్, జూనియర్ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు. యూత్ హాస్టల్స్ ప్రతినిధులు బి. ఉమామహేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరావు, సీహెచ్ వేణు, నాగసాయి, సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేట పెట్రోల్ బంక్ ఎదురుగా గ్రీన్ సిటీకి వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్న సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి నీలం రంగు అండర్‌వేర్, ఎరుపు రంగు టవల్ ధరించి ఉన్నాడని, వయస్సు సుమారుగా 40 ఏళ్లు పైబడి ఉంటుందని గుర్తించారు. సదరు వ్యక్తికి చెందినవారు ఎవరైనా ఉంటే దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని తెలిపారు.

మద్యం మత్తులో న్యాయవాది మృతి

అల్లిపురం: విపరీతంగా మద్యం తాగటంతో న్యాయవాది మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం రొంకాన శ్రీకాంత్ (41) న్యాయవాద వృత్తి చేస్తున్నారు. ఇతను నాలుగు రోజులుగా ఇంటికి వెళ్లకుండా తన కార్యాలయంలోనే మద్యం తాగుతూ ఉండిపోయారు. ఈ నెల 12వ తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లలితాకాలనీలో గల ఆఫీసులో ఉన్నానని సమాధానం చెప్పారు. అతని మామయ్య 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతని కార్యాలయానికి వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. సందులో నుంచి చూడగా కింద పడిపోయి వున్నారు. ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా ఫోన్ తీయకపోవటంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అతను ఎంతకీ లేవకపోవటంతో 108కి ఫోన్ చేశారు. వారు చూసి చనిపోయినట్లు తెలిపారు. మృతుని మామ గుండ్ల గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.